డీలర్ల కేటాయింపులో అవకతవకలు జరిగితే సహించం

మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, ఆగస్టు 12 : రేషన్ దుకాణాల డీలర్ల కేటాయింపులో అవకతవకలు జరిగితే సహించేది లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకొని రాత, మౌఖిక పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే రేషన్ షాపు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, మున్సిపాల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్ , కౌన్సిలర్ నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడుపొద్దు

వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి, ఆగస్టు 12 : వాహనదారులు మద్యం తాగి వాహనాన్ని నడుపొద్దని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో వారం రోజుల నుంచి నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్ సైకిల్‌పై వెళ్లే వ్యక్తులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఎక్కువ శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్లు, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడుపొద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న మొత్తాల పొదుపుపై అవగాహన

రాజంపేట్, ఆగస్టు 12 : మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో తపాలా ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తపాల శాఖ స్కీమ్స్‌ను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాజంపేట ఎస్‌పీఎం భిక్షపతి, ఎంవో వెంకట్రామిరెడ్డి, బీపీఎం ప్రతాప్‌రెడ్డి, ఏబీపీఎం రజిత, తపాల సిబ్బంది ప్రసాద్, రాంబాబు, నరహరి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 12 : ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, విలేకరులు కూర్చోవడానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీసు, అగ్నిమాపక, అటవీ, జిల్లా వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో శకటాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా ఉద్యానవన, మిషన్ భగీరథ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, వ్యవసాయం, విద్య, అటవీ శాఖ, మహిళా, శిశు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, ఉపాధి హామీ, ఇందిరాక్రాంతి పథం శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీవో రాజారాం, డీఆర్డీవో సురేందర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, డీపీవో శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు యవకుల బైండోవర్

భిక్కనూరు, ఆగస్టు 12 : న్యూసెన్స్ చేస్తున్న ఇద్దరు యువకులను తహసీల్దార్ శివ ప్రసాద్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన రాహుల్, గోపాల్ ప్రతిరోజూ రాత్రి మద్యం తాగి అవసరం లేకున్నా 'డయల్ 100'కు ఫోన్ చేస్తున్నారని, అక్కడికి వెళ్లి చూడగా వారు పారిపోతూ పోలీసుల సమయాన్ని వృథా చేస్తున్నందుకు బైండోవర్ చేశామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్

భిక్కనూరు, ఆగస్టు 12 : వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ బైక్‌ను దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్‌ను బైక్ చోరీ కేసులో మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ దీక్షిత ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు అతడికి 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ కోసం కామారెడ్డి సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కొండాపూర్‌లో 'రైతు పొలం బాట'

రాజంపేట్, ఆగస్టు 12 : మండలంలోని కొండాపూర్‌లో టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ శాఖ ఏఈ మారుతి ఆధ్వర్యంలో సోమవారం రైతు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతులు స్టాటర్ డబ్బాలో ఫ్యూజులను ఎప్పటికప్పుడూ సరి చూసుకోవాలన్నారు. రైతులు స్వయంగా రిపేర్లు చేయకూడదని సూచించారు. పందుల కోసం కరెంట్ పెట్టొదని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ సుధాకర్, లైన్‌మన్ సుధాకర్, జేఎల్ఎం సుభాష్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, ఆగస్టు 12 : పాల్వంచ మండలంలోని వాడి గ్రామానికి చెందిన పోన్నాల నర్సింహులు ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ఫోన్ ను బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో సోమవారం అందజేశారు.

ఎన్నికైన జిల్లా బుడగ జంగం కార్యవర్గం

జిల్లా బేడ బుడగ జంగం కార్యవర్గవం ఎన్నిక

కామారెడ్డి, ఆగస్టు 12 : కామారెడ్డి జిల్లా బేడ బుడగ జంగం సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విభూది సాయిలు, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, సలహాదారులుగా మోహన్, ఉపాధ్యక్షుడిగా అంజయ్య, కోశాధికారిగా సంగమేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'సాగర్' నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ (బీర్కూర్), ఆగస్టు 12 : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగుకోసం అందిస్తున్న నీటిని పొదుపుగా వాడుకోవాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. సోమవారం బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పర్యటించారు. సుమారు రూ. 20 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల అదనపు తరగతి గదులు, రూ. 11 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం మాట్లాడారు. వర్షాలు అంతంత మాత్రమే కురుస్తున్నప్పటికీ రైతులు వేసుకున్న పంట పొలాల సాగుకు నీటితో ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లో సుమారు నాలుగు టీఎంసీల నీరు నిల్వ ఉందని, రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు వేసుకున్న పంట పొలాలను ఎండనివ్వబోమని భరోసా ఇచ్చారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని, ఈ ప్రాంత ప్రజల క్షేమం కోరే తాను కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

కామారెడ్డి, ఆగస్టు 12 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడూ పరిశీలించి పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజావాణిలో 170 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేందర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, సీపీవో రాజారాం, జిల్లా అధికారులు, కలెక్టర్ ఏవో మసూర్ అహ్మద్ పాల్గొన్నారు.

కాశి గుండంలో ఎమ్మెల్యే పూజలు

బాన్సువాడ, ఆగస్టు 12 : మండలంలోని కౌలాస్ గ్రామంలోని అడవుల్లో పురాతన కాలం నాటి శివాలయాన్ని పునర్నిర్మాణం చేసి రామ్‌రావు మహారాజ్ 11 రోజుల సప్తాహం, రుద్రపూజా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. రమేశ్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

బాన్సువాడ, ఆగస్టు 12 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలో అక్రమ భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సోమవారం ఆర్డీవో రాథోడ్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కల్కి చెరువు నుంచి సోమేశ్వర్ వరకు హద్దులు ఏర్పాటు చేయాలని, బాన్సువాడ పెద్ద పూల్ వాగు కబ్జాకు గురైందని, విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, గంగారెడ్డి, ఉపాధ్యక్షుడు గంగారాం, తోట శంకర్, చిరంజీవి, భూమేశ్, హరి పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

నస్రుల్లాబాద్, ఆగస్టు 12 : బీర్కూర్ గ్రామ శివారులోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద సోమవారం బైక్ అదుపుతప్పడంతో ముగ్గురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. హస్గుల్ గ్రామానికి చెందిన హన్మంత్‌రావు, భార్య, కుమారుడు స్వామి వారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో కొండ దిగువ ఉన్న అలిపిరి వద్ద బైక్ అదుపు తప్పి పంట పొలాల్లోకి వెళ్లడంతో ముగ్గురికి గాయాలు కావడంతో వారిని స్థానికులు బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు, ఆగస్టు 12 : ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలనీ సిద్ధరామేశ్వర నగర్ గ్రామ ప్రజలు కోరారు ఈ మేరకు గ్రామ పరిధిలోని జాతీయ రహదారి వద్ద జరిగే ప్రమాద స్థలాలను నేషనల్ హైవే అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఐ అధికారులు ఇరువైపులా బస్టాండు ఏర్పాటుకు, లైటింగ్ కోసం సర్వే నిర్వహించారు. వారం రోజుల్లో పని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు

గాంధారి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టు పిచ్చి మొక్కలతో పాటు గడ్డి ఏపుగా పెరిగి, అక్కడి పరిసరాలు భయంకరంగా మారాయి. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితమవగా.. అధికారులు స్పందించారు. ఎంపీడీవో, తహసీల్ కార్యాలయ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలతోపాటు ఏపుగా పెరిగిన గడ్డిని కార్మికులతో తొలగింపజేశారు. దీంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తూ.. 'నమస్తే తెలంగాణ'కు ధన్యవాదాలు తెలిపారు.

15న పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 12: పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు పంటల సాగుకు ఈ నెల 15న నీటి విడుదల చేయాలని రైతులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల ఆయకట్టుకు నీటి విడుదలపై రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో 16 అడుగుల నీరు (ఒక టీఎంసీ) నిల్వ ఉన్నదని, ఎన్ని విడుతల్లో నీటిని అందించాలనే అంశంపై రైతులతో చర్చించారు. నాలుగు విడుతల్లో 15 రోజుల పాటు నీటి విడుదల చేపట్టి, పది రోజుల విరామం ఇవ్వాలని తెలిపారు. దీంతో నాలుగు విడుతల్లో నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేసి, ఈ నెల 15న నీటి విడుదల చేయాలని తీర్మానించారు. మొదటి విడుత ఈ నెల 15 నుంచి 29 వరకు, ఈ నెల 30 నుంచి సెప్టెంబర్8 వరకు విరామం, రెండో విడుత సెప్టెంబర్9 నుంచి 23 వరకు నీటి విడుదల, 24 నుంచి అక్టోబర్3 వరకు విరామం, మూడో విడుత అక్టోబర్ 4 నుంచి 18వరకు నీటి విడుదల, 19 నుంచి 28 వరకు విరామం. నాల్గో విడుత అక్టోబర్ 29 నుంచి నవంబర్12 నీటి విడుదల, 13 నుంచి 22 వరకు విరామం ఉంటుందని ఆయన వివరించారు. ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయవద్దని సూచించారు. సమావేశంలో ఏఈ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు లక్ష్మణ్, సంగమేశ్వర్, నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న నీటి పారుదలశాఖ డీఈఈ వెంకటేశ్వర్లు

వ్యవసాయ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

నాగిరెడ్డిపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయాన్ని సోమవారం ఏడీఏ వీరాస్వామి సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలు, ఇబ్బందులను ఏవో విజయశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉండి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. మండలంలో పంటల సాగుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటరు జాబితా తయారీపై అవగాహన

నిజాంసాగర్, ఆగస్టు 12 : మండల కేంద్రంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఓటరు జాబితా తయారీపై అవగాహన కల్పించారు. లోక్‌సభ ఓటరు జాబితా నుంచి పంచాయతీలు, వార్డుల వారీగా జాబితాను రూపొందించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

కొమలంచలో కంటి వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

నిజాంసాగర్, ఆగస్టు 12: మహ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో సోమవారం బాన్సువాడ లయన్స్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు శ్రావణి 28 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25 మందికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో ఆరుగురిని శస్త్రచికిత్స కోసం బాన్సువాడ దవాఖానకు తరలించారు.

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు

రామారెడ్డి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సురేశ్ 180మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరంతో బాధపడుతున్నవారికి మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపై వైద్యుడు సురేశ్ అవగాహన కల్పించారు. గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

సుభాష్‌చంద్రబోస్ విగ్రహం, పరిసరాలు శుభ్రం

నాగిరెడ్డిపేట, ఆగస్టు12: మండల కేంద్రంలోని సుభాష్‌చంద్రబోస్ కాలనీలోఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహంపాటు పరిసరాలను బీజేపీ మండల నాయకులు సోమవారం శుభ్రం చేశారు. విగ్రహం చుట్టు పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. తిరంగా యాత్రలో భాగంగా మంగళవారం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేయిస్తామన్నారు. అనంతరం నూతనంగా వచ్చిన ఎస్సై మల్లారెడ్డిని కలిసి సన్మానించారు.

పర్యాటక కేంద్రంగా లింగంపేటను తీర్చిదిద్దుతాం..

రెయిన్‌వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనా రమేశ్

లింగంపేట, ఆగస్టు 12: పర్యాటక కేంద్రంగా లింగంపేట మండల కేంద్రాన్ని తీర్చదిద్దడానికి కృషి చేస్తున్నట్లు రెయిన్‌వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్ వెల్లడించారు. సోమవారం ఆమె మండల కేంద్రంలోని పురాతన ఆలయాలు, కట్టడాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని గాలికి ఊగే ధ్వజ స్తంభం, గుట్టపై ఉన్న జోగినాథ ఆలయం, రామాలయ చరిత్రకు సజీవ సాక్ష్యాలు అని తెలిపారు. గ్రామంలోని చారిత్రక కట్టడాలపై ప్రచారం లేని కారణంగా వాటి ప్రాముఖ్యత మరుగున పడుతున్నదని అన్నారు. మండల కేంద్రంలోని రామాలయ ఆవరణలో సైతం చిన్న మెట్ల బావి ఉన్నదని దానిని మూసి వేసినట్లు ఆమె దృష్టి తీసుకువచ్చారు. బావిపై ఉన్న మట్టిని తొలగిస్తామన్నారు. అనంతరం శెట్పల్లి గ్రామశివారులోని శివాలయాన్ని పరిశీలించారు. ఆలయం పక్కన ఉన్న బావిని పరిశీలించారు. పురాతన కట్టడాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మండల కేంద్రంలోని నాగన్న బావిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో నరేశ్ తదితరులు ఉన్నారు.

రామాలయం పరిసరాలను పరిశీలిస్తున్న రెయిన్‌వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★మహేశ్వరంలో ప్లాట్లు..., నేడు తక్కువ ధరలో..., రేపు కోట్లలో... మరో న్యూయార్క్, ఫోర్త్ సిటీ, 100-250-300 గజాల ప్లాట్లు. Cont: 8008091512.
NT-332620
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నాగిరెడ్డిపేట, ఆగస్టు 12: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట బోధన్-హైదరాబాద్ రహదారిపై సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలకు జరిమానా విధించారు. వాహనాల తనిఖీలో ఏఎస్సై లచ్చురాం నాయక్, కానిస్టేబుల్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ జడ్పీటీసీ మృతి

లింగంపేట, ఆగస్టు 12: లింగంపేట జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కమ్మరి సుగుణ (75) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందినట్లు ఆమె కుమారుడు కమ్మరి వెంకటేశం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వెంకటేశం తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆమె చురుగ్గా పాల్గొన్నారు.

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

కామారెడ్డి/లింగంపేట, ఆగస్టు 12 : సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారికి జిల్లా కేంద్రంతోపాటు లింగంపేటలో ఉద్యోగులు సోమవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే ప్రకటించాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 20 ఏండ్లుగా పని చేస్తున్న ఉద్యోగులను సీఎం ఇచ్చిన మాట ప్రకారం క్రమబద్ధీరణ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమం లో ఉద్యోగులు చిరంజీవి, వెంకటేశ్, రాములు, మా ధవి, కవిత, కాళిదాసు, శంకర్, వెంకటయ్య, శైలజ, సారిక, భక్తమాల, లింగంపేటలో జేఏసీ సభ్యులు రాజు, గంగాధర్, స్వప్న, శ్యామల, సంజీవులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

లింగంపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయం, ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలపై మందును పిచికారీ చేయించినట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అన్ని కాలనీల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

అదుపు తప్పి కారు బోల్తా

నిజాంసాగర్, ఆగస్టు 12 : మండలంలో 161 నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. హైదరాబాద్ నుంచి పిట్లం వైపు వెళ్తున్న కారు నర్సింగ్‌రావుపల్లి గ్రామ సమీపంలోని 161 జాతీయ రహదారిపై కుక్కను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

'ప్రజావాణి'కి ఒక ఫిర్యాదు

లింగంపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కోమట్‌పల్లి గ్రామ శివారులో ఉన్న అల్లూరమ్మ ఆలయ పరిసరాల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని ఫిర్యాదు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మల్హారీ, వ్యవసాయ శాఖ అధికారి అనిల్, ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, ఆగస్టు 12: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్ కుమార్ సూచించారు. వాన కాలంలో సాగు చేసే పంటల సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎల్లారెడ్డి బంద్

ఎల్లారెడ్డి, ఆగస్టు 12: హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణంలో మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చాయి. సోమవారం ఎల్లారెడ్డిలో హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడారు. పొరుగు దేశమైన